ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కడప
జిల్లా వార్తలు

గురువారం 7 మార్చి 2024

త్వరలో నోటిఫికేషన్

● అధికారులు ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి

● శిక్షణలో కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 6: త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుందని, అధికారులు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో సాధారణ ఎన్నికలకు సంబంధించి ఈఆర్వోలు, సబ్ డివిజనల్ పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, అసెంబ్లీ నియోజకవర్గాల మాస్టర్ ట్రైనర్లకు రెండవ దశ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అతి త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుందన్నారు. జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి అధికారి సంసిద్ధం కావాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది పాత్ర అత్యంత కీలకమైనదన్నారు.

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

జిల్లాలో గత ఏడాది డిసెంబరు నెలలో వచ్చిన తుఫాన్ ప్రభావంతో 4,275 హెక్టార్లలో పంటలు నష్టపోయిన 7,521 మంది రైతులకు మంజూరైన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.7.01 కోట్లను బుధవారం రైతుల ఖాతాల్లో జమచేశారు. అలాగే 169 హెక్టార్లలో ఉద్యాన పంటలు నష్టపోయిన 254 మంది రైతులకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తం రూ.40.17 లక్షలను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో లబ్ధిదారులకు మెగా చెక్కును కలెక్టర్ వి.విజయరామరాజు అందజేశారు. జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి రాజీవ్ మైఖేల్ తదితరులు హాజరయ్యారు.

నిర్భయంగా ఓటేయండి : కలెక్టర్



పెద్దదండ్లూరు పోలింగ్ కేంద్రం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

జమ్మలమడుగు, మార్చి 6: ప్రజలు పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి నిర్భయంగా ఓటు వేయాలని కలెక్టర్ వి.విజయ రామ రాజు పెద్ద దండ్లూరు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం జమ్మలమడుగు మండలంలోని పెద్దదండ్లూరు గ్రామాన్ని సందర్శించారు. ముందుగా ఆయన పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం అక్కడున్న ప్రజలతో మాట్లాడారు. పెద్దదండ్లూరులో గత ఎన్నికల్లో గొడవలు జరిగాయని, ఈసారి ఏదైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తెలపాలన్నారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి నిర్భయంగా ఓటు వేసుకోవాలని చెప్పారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ.. తమ గ్రామంలో ఎక్కడా ఇబ్బందులు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, తహశీల్దారు కరుణాకర, సచివాలయ సిబ్బంది, ఆర్ఐ రోహిత్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ భాస్కర్‌రెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

పులివెందులటౌన్, మార్చి 6: రానున్న సార్వత్రిక ఎన్నికలకు పోలీస్ అధికారులు, సిబ్బంది సర్వసన్నద్ధం కావాలని, ఎలాంటి ఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటుచేయాలని ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ పోలీస్ అధికారులు, సిబ్బందికి రెండో దశ శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ రానున్న ఎన్నికలకు చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డ వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ట్రబుల్ మాంగర్లు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఏదైనా సంఘటన జరిగినపుడు వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు, స్పెషల్ బ్రాంచ్, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్నాళ్లకు గుర్తొచ్చామా..!





"అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తోంది. ఇంతవరకు కార్పొరేటర్ల బాగోగులు చూసుకోలేదు. మా సమస్యలను పట్టించుకోలేదు. ఇప్పుడు ఎన్నికల టైం కావడంతో మా దగ్గరకు వచ్చారా.." అంటూ కొందరు కార్పొరేటర్లు డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను నిలదీస్తున్నారని సమాచారం. దాదాపు ఐదేళ్లుగా ఏనాడూ తమ ఇళ్లకు రాలేదని, తమ బాగోగులు చూడలేదని.. ఎన్నికలకు నెలముందు తమ ఇళ్లకు రావడం ఎందుకంటూ ప్రశ్నించారని అంటున్నారు. ఐదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నాం.. పార్టీ జెండా మోసి ఆర్థికంగా నష్టపోయాం.. అధికారం చేపట్టిన ఈ ఐదేళ్లలో మాకేమైనా చేశారా అంటూ వారు ప్రశ్నించడంతో డిప్యూటీ సీఎం అండ్ కో ఆందోళన చెందుతున్నట్టు వైసీపీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

● డిప్యూటీ సీఎంను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు ?

● పార్టీ జెండా మోసి ఆర్థికంగా దివాళా తీసినవారిని ఆదుకున్నారా..?

● కార్పొరేటర్ల ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరవుతున్న డిప్యూటీ సీఎం

● జగన్‌ను సీఎం చేసేందుకు డివిజన్లలో తిరగండి

● కార్పొరేటర్ల చుట్టూ తిరుగుతున్న వైనం

(కడప-ఆంధ్రజ్యోతి): మరో ఒకటిన్నర నెలలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా గడప గడపకూ మన ప్రభుత్వం పేరిట ఓటు అడిగేందుకు ఇంటింటికీ వెళుతున్నారు. అయితే గత ఎన్నికల్లో కీ రోల్ పోషించి చురుగ్గా ఉన్న కొందరు కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు కొన్ని నెలలుగా ముఖం చాటేశారు. ఎన్నికలవేళ కార్పొరేటర్లు ప్రచారాలకు దూరంగా ఉండడంతో డిప్యూటీ సీఎం నేరుగా వారి ఇళ్లకే వెళుతున్నారు. అయితే అక్కడ కొందరు కార్పొరేటర్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడం చూసి ఆయన అవాక్కవుతున్నట్లు వైసీపీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కడప టీడీపీ ఇన్‌చార్జిగా ఆర్.మాధవీరెడ్డిని ప్రకటించారు. ఆమె అప్పటి నుంచి జనంలోకి దూసుకెళుతున్నారు. తొలిజాబితాలోనే కడప అభ్యర్థిగా ఆమెను ప్రకటించారు. ఆమె బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరిట కడప నగరంలో ఇంటింటికీ వెళుతున్నారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలను, వైసీపీ హయాంలో కడపలో జరిగిన భూకబ్జాలు ఇతర వాటిని జనాల్లోకి తీసుకెళుతున్నారు. వైసీపీకి చెందిన పలువురిని టీడీపీలోకి చేర్చుకుంటూ వస్తున్నారు. దీన్ని డిప్యూటీ సీఎంతో పాటు వైసీపీ వర్గాలు తొలుత లైట్‌గా తీసుకున్నా.. ఇలా అయితే కడపలో ఫ్యాన్ రెక్కలు విరుగుతాయని భావించినట్లు చెబుతారు.

వైసీపీ నుంచే పర్సంటేజీలు

వైసీపీలో మళ్లీ టికెట్ ఇస్తే ముచ్చటగా మూడోసారి గెలవాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా భావిస్తున్నారు. గతంలో లాగా ఈసారి వార్ వన్‌సైడ్‌గా లేదు. ఇప్పుడు టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి నేతృత్వంలో టీడీపీ బాగా బలం పుంజుకున్నట్లు వైసీపీ వర్గాలు అంచనాకు వచ్చాయని చెబుతారు. దీంతో అలర్ట్ అయిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఇటీవలే ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అయితే గత ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు కీరోల్‌గా ఉన్న కొందరు కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు ఇటీవల పార్టీ కార్యక్రమాలకు అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ "ఇప్పుడు మీరంతా పచ్చడి మెతుకులు తింటున్నారు.. కష్టాల్లో నా వెంట నడిచిన వారికి రేపు మన ప్రభుత్వం వస్తే బిర్యానీ తినిపిస్తా" అంటూ ఊరిస్తూ వచ్చారు. అందుకు తగ్గట్లుగానే 2019 ఎన్నికల్లో అంజద్‌బాషా గెలుపులో వీరంతా ప్రధానపాత్ర పోషించారు. జగన్ సీఎం, అంజద్ బాషా డిప్యూటీ సీఎం అయిపోయారు. ఇక అంతా మంచిరోజులే అనుకుని కార్పొరేటర్లు సంతోషించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. అయితే ఈ పనుల కేటాయింపుల్లో కూడా రూ.లక్షకు 8శాతం చొప్పున వైసీపీ కార్పొరేటర్ల నుంచే 'పెద్దలు' కొందరు పర్సంటేజీలు వసూలు చేయడం విమర్శలకు దారితీసింది. వైసీపీ గెలుపు కోసం కష్టపడిన కేడరు నుంచే పర్సంటేజీలు తీసుకోవడం వీరు జీర్ణించుకోలేకున్నారు.

ఇన్నాళ్లకు గుర్తుకు వచ్చామా

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా గడపగడపకు మన ప్రభుత్వం పేరిట ఇటీవల కడప నగరంలో పర్యటిస్తున్నారు. గత రెండు ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం కీలకంగా వ్యవహరించిన కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు ఇటీవల సైలెంట్ అయిపోయారు. వారిని డిప్యూటీ సీఎం కలిసి బుజ్జగించే ప్రయత్నాలకు తెరలేపారని అంటారు. ఇప్పటి వరకు 1, 3, 8, 19, 49, 46, 40, 44, 35, 38 డివిజన్లతో పాటు మొత్తం 20కి పైగా డివిజన్లలో పర్యటిస్తూ సుమారు 20 మంది కార్పొరేటర్లను డిప్యూటీ సీఎం నేరుగా కలిశారంటారు. ఎందుకు మీరంతా సైలెంట్‌గా ఉంటున్నారు. జగన్‌ను సీఎం చేసేందుకు మీరంతా అన్ని డివిజన్లకు వెళ్లండి అని కోరగా పలువురు కార్పొరేటర్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైనట్లు తెలిసింది. "జగన్ సీఎం, మీరు డిప్యూటీ సీఎం అయి ఐదేళ్లు కావస్తోంది. ఇన్నాళ్లు మమ్మల్ని పట్టించుకోలేదు, మేం వచ్చినా కూడా పలికీపలకనట్లు ఉంటారు. చూసీచూడనట్లు ఉంటారు.. మీకోసం ఎంతో కష్టపడ్డాం. ఆర్థికంగా నష్టపోయాం. మమ్మల్ని పట్టించుకోవడం లేదు. ఐదేళ్ల తరువాత ఇప్పుడు గుర్తుకు వచ్చామా" అంటూ కొందరు నిలదీసినట్లు చెబుతారు. "ఈ ఐదేళ్లలో మీకు భజన చేస్తున్న కొందరికే లబ్ధి చేకూర్చారు. పార్టీ కోసం జెండా పట్టుకుని నష్టపోయిన వారిని ఎవరినీ ఆదుకోలేదు. రాజీవ్‌మార్గ్ రహదారి విస్తరణ, రాజీవ్‌పార్కు సుందరీకరణ, కలెక్టరేట్ రోడ్డు పనులు, క్రిష్ణాసర్కిల్ నుంచి దేవుని కడ వెళ్లే రహదారి పనులు.. ఇలా కీలకమైన పనులన్నీ కొందరికే అప్పగించి కొందరికే లబ్ధి చేకూర్చారు. మాకేం చేశారు" అంటూ నిలదీయండతో ఆయన అవాక్కయ్యారంటారు. మట్టి ఇసుక, గ్రావెల్ పనులన్నీ కోటరీలో ఉన్నవారికే కట్టబెట్టారు. ఇప్పుడు మావద్దకు వచ్చారా అంటూ కొందరు అడగడంతో డిప్యూటీ సీఎం బిక్కముఖం వేసుకున్నారన్న ప్రచారం వైసీపీలో ఉంది. ఓ కార్పొరేటరు వద్దకు వెళ్లి ఎందుకు నీవు చురుగ్గా లేవు అనగా.. నేను చురుగ్గా పాల్గొనలేను... మీ అల్లుడిని ఇన్‌చార్జిగా పెట్టండి.. ఆయన ఆధ్వర్యంలో పని చేస్తాం అంటూ తెగేసి చెప్పినట్లు సమాచారం. కార్పొరేటర్ల నుంచి ఊహించని విధంగా ప్రశ్నలు ఎదురవుతుండడంతో అంజద్‌బాషా అండ్ టీం ఉక్కిరిబిక్కిరవుతున్నట్లు చెప్పుకొస్తున్నారు. వైసీపీలో అసంతృప్తిగా ఉన్న కొందరు కార్పొరేటర్లు, మాజీకార్పొరేటర్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడితో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో మాకేం చేశావ్, ఐదేళ్లకు గుర్తుకు వచ్చామా అంటూ కార్పొరేటర్లు ప్రశ్నించడంతో వారికి జవాబు చెప్పలేక డిప్యూటీ సీఎం నీళ్లు నములుతూ.. మనం మళ్లీ జగన్‌ను సీఎం చేసేందుకు అందరం కలసి పనిచేద్దామని చెబుతున్నట్లు తెలుస్తోంది.

రాచమల్లు పైశాచికత్వం తగదు

● పత్రికల్లో వార్తలకే ఉలికిపాటెందుకు

● ఓటమి భయంతో నీచానికి దిగజారుతున్నావు

● బాలుడి పట్ల అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు చేయాలి

● టీడీపీ నేతల డిమాండ్



మాట్లాడుతున్న సీఎం సురేశ్‌నాయుడు
చిత్రంలో లింగారెడ్డి, ముక్తియార్ తదితరులు

ప్రొద్దుటూరు, మార్చి 6: అరాచకమల్లు అని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని జీర్ణించుకోలేక నాలుగేళ్ల బాలుడిపట్ల పైశాచికత్వంతో ప్రవర్తించిన ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని టీడీపీ నేత సీఎం సురేశ్‌నాయుడు డిమాండ్ చేశారు. బహిరంగంగా బాలుడి హక్కులను కాలరాసిన ఎమ్మెల్యేతో పాటు వైసీపీ కార్యకర్తలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

బుధవారం స్థానిక అన్నా క్యాంటీన్‌లోని టీడీపీ కార్యాలయంలో సురేశ్‌నాయుడు మాట్లాడుతూ.. ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన ప్రతి విషయం వాస్తవమన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తికి పత్రికలు, ప్రతిపక్షాల ఆరోపణలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎలా ఎదుర్కోవాలో చేతకాకపోవడం ప్రొద్దుటూరు ప్రజల దౌర్భాగ్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతిని గురించి మాట్లాడే ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి.. చంద్రబాబు లోకేశ్‌పై సాక్షిలో రాసే రాతలకు ఆపత్రికను దేనికి తుడవాలో కూడా చెప్పాలన్నారు. ము.. తుడుచుకోవడానికి పనికిరాదని చెప్పే పేపర్లో వార్తలొస్తే ఉలికిపాటెందుకు పడుతున్నారో రాచమల్లు సమాధానం చెప్పాలన్నారు. పత్రికలను వాటి అధినేతలను పాత్రికేయులను దూషించటం పిరికిపంద చర్య అన్నారు.

మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నప్పుడు విమర్శలు ప్రతివిమర్శలు ఆరోపణలు సహజం అన్నారు. రాచమల్లు తనపై పత్రికలు ప్రతిపక్షాలు చేసే విమర్శలను కూడా జీర్ణించుకోలేక నీచమైన పద్ధతులకు దిగడం తగదన్నారు. బాలుడిపట్ల ప్రవర్తించిన తీరుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆమేరకు కలెక్టర్‌కు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ న్యాయవాది ఈవీ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాచమల్లు చదువుకున్న విద్యావంతుడైన మూర్ఖుడన్నారు. ఓటమి భయంతో ఫ్రస్ట్రేషన్‌లో ఎంతవరకైనా దిగజారి ప్రవర్తించటం దారుణమన్నారు. బాలుడిపై ప్రవర్తించిన తీరుకు ఎమ్మెల్యేపై మానవ హక్కుల కమిషన్ కేసు నమోదు చేయాలన్నారు. జనసేన నియోజకవర్గ ప్రతినిధి జిలాన్ మాట్లాడుతూ బాలుడిపట్ల ఎమ్మెల్యే రాచమల్లు చర్యలు హేయమైనవని జుగుప్సాకరంగా ఉన్నాయన్నారు. పిల్లవాడి ఏడుపును చూసి రాక్షసానందం పొందిన వైసీపీ కార్యకర్తలు మానసిక వైకల్యం చెందారన్నారు. సమావేశంలో టీడీపీ మాజీ ఎంపీపీ శెట్టి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ యువత అధికార ప్రతినిధి నల్లబోతు నాగరాజు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రాచమల్లుపై హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు స్వీకరణ

3649/ఇన్/2024 నెంబరుగా కేసు డైరీలో నమోదు

ప్రొద్దుటూరు, మార్చి 6: ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి మంగళవారం ఒక బాలుడు ఏడుస్తున్నా బట్ట లూడదీయాలంటూ తన అనుచరులను ఉసిగొల్పడం, పేపర్‌తో బాలుడి ము.. తుడవమని, గు.. తుడవమని అసభ్యంగా ప్రవర్తించటంపై హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సహాయకార్యదర్శి కరుణాకర్ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ బుధవారం 3649 /ఇన్/2024గా కేసు డైరీలో ఫిర్యాదు నమోదు అయింది. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ పత్రికలో వచ్చిన ఆరోపణలను ఖండించే స్వేచ్ఛ ఎమ్మెల్యేకు ఉందన్నారు. అంతేకాని పత్రికాస్వేచ్ఛను హరించేలా జుగుప్సాకరంగా ఆయన కక్షపూరిత వ్యవహారం ప్రదర్శించడం కోసం బాలుడిని బహిరంగ ప్రదేశంలో బట్టలూడదీసి అసభ్యంగా మాట్లాడటం వారి హక్కులను హననం చేయడమేనన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆ సంఘటనలో పాల్గొన్న వైసీపీ కార్యకర్తలు కూడా చర్యలకు బాధ్యులే అన్నారు. ఈ అమానవీయ ఘటనను వీడియోలో చిత్రీకరించి యూట్యూబ్ చానల్స్‌లో ప్రసారం చేయడంపై కూడా మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని. త్వరలో వీరిపై హెచ్‌ఆర్‌సీ విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందన్నారు.

ఎన్నికల వేళ.. వైసీపీ తాయిలాలు



వెలుగు సీసీలు, యానిమేటర్లకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్

ప్రొద్దుటూరు, మార్చి 6: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తాయిలాలతో ఓటర్లకు గాలం వేస్తున్నారు. ప్రభుత్వ రంగంలో పనిచేసే వెలుగు సిబ్బందికి రాబోయే మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక గోపవరం పంచాయతీలోని వెలుగు కార్యాలయంలో 8 మంది సీసీలకు డిన్నర్‌సెట్‌లు, 70మంది యానిమేటర్లకు టీకప్పులు, సాసర్ సెట్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో వైసీపీకి ఓటువేసి వేయించి తిరిగి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇప్పుడు యానిమేటర్లకు ఇచ్చే పదివేల జీతాన్ని 15 వేలకు పెంచుతానని హామీ ఇచ్చారు. యానిమేటర్లు పదవీవిరమణ చెందితే వారికి నగదు బాండ్లు అందజేసి చీరా సారే పెట్టి సన్మానిస్తానన్నారు. పొదుపు మహిళల సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం కోసం కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామన్నారు. కాగా.. మసీదుల్లో ప్రార్థనలు చేసే ఇమామ్‌లు, మౌజమ్‌లకు అమృతనగర్‌లో 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిస్థలాలు ఇచ్చింది. తిరిగి వైసీపీ ప్రభుత్వం ఇచ్చినట్లుగా వారికి పట్టాలు ఇచ్చి స్థలాలు చూపి ఇంటి రుణం రూ.1.80 లక్షలతో పాటు తాను రూ.లక్ష సహాయం చేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ తాయిలాల పరంపర ఎన్నికలకోడ్ వచ్చే వరకు కొనసాగిస్తారని ఓటర్లను తన వైపు తిప్పుకోవడానికి ఎంత డబ్బు అయినా వెచ్చించడానికి సిద్ధమయ్యారని వైసీపీ వర్గాలే వెల్లడిస్తున్నాయి.

రాజధాని తరలింపు నిర్ణయం వైసీపీకి మరణశాసనం : తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 6: రాష్ట్ర రాజధానిని అమరావతి నుంచి విశాఖపట్టణానికి తరలించాలని ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న ప్రయత్నం వైసీపీకి మరణశాసనం అవుతుందని, ఇది ఒక చారిత్రిక తప్పిదమని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిని రాష్ట్రం నడిబొడ్డులోనున్న అమరావతి నుంచి విశాఖపట్టణానికి తరలించాలన్న జగన్ నిర్ణయాన్ని ఏ ప్రాంతం వాళ్లు కూడా హర్షించడం లేదన్నారు. రాజధాని విశాఖకు వస్తే ప్రశాంతమైన ఉత్తరాంధ్ర అశాంతిమయం, మాఫియామయం అవుతుందని ఉత్తరాంధ్ర ప్రజలు భయపడిపోతున్నారన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయవద్దని, విశాఖ మెట్రో, విశాఖ రైల్వేజోన్‌ను ఏర్పాటుచేయాలని ఉత్తరాంధ్రప్రజలు కోరుతున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయమని గోదావరి జిల్లాల ప్రజలు అడుగుతున్నారన్నారు. రాజధానిని విశాఖకు తరలిస్తే మరింత దూరాభారమవుతుదని రాయలసీమ, నెల్లూరు ప్రజలు వాపోతున్నారన్నారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అదీ అమరావతి.. ఇది కాంగ్రెస్ విధానం, నినాదమని తులసిరెడ్డి పునరుద్ఘాటించారు.

వైభవంగా వీరభద్రుడి కల్యాణోత్సవం

● ఘనంగా క్షేత్ర పాలక కాలభైరవ హోమం ● భక్తిశ్రద్ధలతో భద్రకాళీ అమ్మవారి సుమంగళి పూజ



అమ్మవారి సుమంగళి పూజకు హాజరైన మహిళా భక్తులు

రాయచోటిటౌన్, మార్చి 6: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ తేదీ బుధవారం వీరభద్రుడి కల్యాణం వైభవంగా జరిగింది. రెండోరోజు ఉదయం క్షేత్రపాలక కాలభైరవ స్వామి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కమనీయంగా, అత్యంత రమణీయంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కన్నుల పండువగా జరిగిన వీరభద్రుడి కల్యాణోత్సవానికి స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాత్రి జరిగిన భద్రకాళీ అమ్మవారి సుమంగళి పూజలో మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో సుమంగళి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భద్రకాళీ సమేత వీరభద్రుడు మయూర వాహనంపై పట్టణ పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే నిర్వహించిన సంకీర్తనలు భక్తులను అలరించాయి.



భద్రకాళీ సమేత వీరభద్రుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం
పెంపొందించడమే లక్ష్యం
జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



బ్యాటరీ సైకిల్స్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 6: దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో రాయచోటి నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ ట్రై సైకిల్స్ వినికిడి యంత్రాలను ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని 613 మంది విభిన్న ప్రతిభావంతులకు 1,03,97,155 విలువ చేసే పరికరాలు అందచేసినట్లు తెలిపారు. ప్రభుత్వం విలువైన పరికరాలు ఉచితంగా అందజేయడం జరిగిందని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారందరికీ అర్హత మేరకు పరికరాలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్‌రెడ్డి, వికలాంగుల సంక్షేమశాఖ అధికారి కృష్ణకిశోర్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా వేమన సతీష్



రాజంపేట, మార్చి 6: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా వేమన సతీష్‌వేమన సతీష్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రచార బాధ్యతల్లో కీలక పాత్ర పోషించాల్సిందిగా వేమన సతీష్‌ను పార్టీ నాయకులు ఆదేశించారు. గతంలో ఆయన తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా, తానా అధ్యక్షుడిగా పనిచేసి మంచి గుర్తింపు పొంది ఉన్నారు. ఈ సందర్భంగా వేమన సతీష్ మాట్లాడుతూ తనను రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నియమించడం సంతోషదాయకమన్నారు. తాను వచ్చే ఎన్నికల్లో కీలక పాత్ర పోషించి విస్తృతంగా పార్టీ గెలుపుకు కృషి చేస్తానన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు
ముగ్గురు జిల్లా క్రీడాకారిణులు



పి.లావణ్య



నాగపూజిత



దేవిక

కడప (స్పోర్ట్స్), మార్చి 6: జాతీయ స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారిణులు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఆర్గనైజేషన్ సెక్రటరీ చిన్నపరెడ్డి, శివప్రసాద్ తెలిపారు. పాలగిరి లావణ్య, వై.నాగపూజిత, వి.దేవిక ఎంపికయ్యారన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం హత్రాస్‌లో ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న 52వ జాతీయ స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. ఆ పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు విజయం సాధించి జిల్లా ఖ్యాతిని చాటాలని వారు ఆకాంక్షించారు.

విద్యుత్ చౌర్యంపై దృష్టి సారించండి
విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ సుబ్బరాజు

కడప (నాగరాజుపేట), మార్చి 6 : విద్యుత్ చౌర్యంపై దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ టెక్నికల్ డైరెక్టరు ఎన్‌వీఎస్ సుబ్బరాజు అధికారులను ఆదేశించారు. కడప పర్యటనలో భాగంగా మొదట 33/11 కేవీ ఎన్‌జీఓ కాలనీ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పగటిపూట వీధిలైట్లు వెలగకుండా తగు చర్యలు తీసుకుని విద్యుత్ వృథాను అరికట్టాలన్నారు. అనంతరం ఎన్జీవో కాలనీ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి తగు సూచనలిచ్చారు. కడప డివిజన్ పరిధిలోని కడప, సీకేదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులు విడుదల చేయడంలో జాప్యం చేయకూడదన్నారు. కడప డివిజన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలు అధికంగా ఉన్నాయని, వీటిని తగ్గించేందుకు అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారులకు అంతరాయాలు లేని నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం శివాలయాల్లో అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఉమ్మడి కడప జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ, సీనియర్ అకౌంటు ఆఫీసరు మధు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నరసింహ ప్రసాద్, హరిసేవనాయక్, ఏఈలు, అకౌంట్స్ విభాగం తదితరులు పాల్గొన్నారు.


ఇండియా కూటమిని గెలిపించండి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 6 : ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు, ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరంలోని రహ్మతీయ ఫంక్షన్‌హాలులో సీపీఐ ఉమ్మడి కడప జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఓబులేసు, ఈశ్వరయ్య హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం కనుమరుగై రాచరిక వ్యవస్థ మొదలవుతుందన్నారు. ఏటా రూ.2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన మోదీ చేసిందేమీ లేదన్నారు. దేశ ప్రజలకు ద్రోహం చేసి కార్పొరేట్ వ్యక్తుల ప్రయోజనాల కోసం పాటుపడుతున్న బీజేపీని ఓడించాలన్నారు. రాష్ట్ర విభజనలో ఉన్న ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు, పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర హక్కులు, ప్రయోజనాలను పాలక ప్రతిపక్షాలు ఢిల్లీ పాలకుల వద్ద తాకట్టు పెట్టారని వారు విమర్శించారు. వ్యక్తిగత ప్రయోజనాలు, అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు బీజేపీకి వత్తాసు పలుకుతున్నారని, ఇటువంటి నాయకులను ఓడించాలన్నారు. సమావేశంలో అన్నమయ్య జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి మహేశ్, జిల్లా సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఉమ్మడి జిల్లాల కార్యవర్గసభ్యులు రామయ్య, నాగసుబ్బారెడ్డి, రాధాక్రిష్ణ, బషీరున్నీసా, జి.వేణుగోపాల్, కేసీ బాదుల్లా, సుమిత్ర, కోటీ, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

సేవాశ్రమంలో గుర్తు తెలియని బాలిక



వివేకానంద సేవాశ్రమంలో ఉన్న గుర్తుతెలియని బాలిక

కాశినాయన మార్చి6: కాశినాయన మండలంలోని ఓబుళాపురం సగిలేరు ఒడ్డునున్న వివేకానంద సేవాశ్రమంలో గుర్తుతెలియని బాలిక ఉందని సేవాశ్రమ నిర్వాహకురాలు రామతులసి తెలిపారు. ప్రొద్దుటూరులోని బొల్లవరంలో రోడ్లపై తిరుగుతున్న బాలికను స్థానికులు గుర్తించి వివేకానంద సేవాశ్రమానికి బుధవారం అప్పగించారన్నారు. బాలికను విచారించగా తనపేరు దుర్గాఅని అమ్మ రాణి,నాన్న నరసింహుడు అని మాది బాపట్ల అంటూ తడబడుతూ సమాధానం చెబుతోందన్నారు. ఆచూకీ తెలిసిన బంధువులుగాని ,కుటుంబసభ్యులుగాని,తల్లిదండ్రులుగాని ఆశ్రమానికి వచ్చి బాలికను తీసుకొని పోవచ్చునన్నారు.

మందు బాబుల జేబుకు చిల్లు



- ప్రభుత్వ మద్యం దుకాణాల్లో..
- ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయాలు
- బెల్టుషాపులకు సరఫరా ఫుల్
- ప్రేక్షక పాత్రలో సంబంధిత అధికారులు



మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్‌ఫొటో)

బద్వేలు, మార్చి 6: అధికారంలోకి వస్తే మద్య నిషేధం చేపడతామని ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గట్టిగా హామీ ఇచ్చారు. అధికారం చేపట్టాక.. మద్య నిషేధం అమలు చేయకపోగా అడిగినంత మద్యం అందుబాటులోకి తెచ్చారు. పల్లెపల్లెనా బెల్టుషాపులు దర్శనమివ్వడమే దీనికి నిదర్శనం. గతంలో కాంట్రాక్టర్లు మద్యం షాపులు నిర్వహించేవారు. వారి షాపులకనుగుణంగా అక్కడక్కడా బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు చేసేవారు. జగన్ అధికారం చేపట్టాక ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడుపుతుండటంతో... పట్టణాలు మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో సైతం విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహించి మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. చీప్‌లిక్కర్ ప్రభుత్వ మద్యం షాపులో రూ.130 ఉండగా బెల్టుషాపులో రూ.200కు విక్రయిస్తున్నారు. చీప్ లిక్కర్‌తో పాటు ఇతర బ్రాండ్లన్నీ క్వార్టర్‌పై రూ.50లు అదనంగా చెల్లించుకోవాల్సి వస్తోందని మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్య నిషేధం మాట గాలికొదిలేసి విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగిస్తుండటంపై మహిళలు ఆందోళన చెందుతున్నారు.

మందుబాబుల జేబుకు చిల్లు

మద్యం ప్రభుత్వ దుకాణాలలో మాత్రమే అమ్ముతుండటంతో ఎమ్మార్పీ ధరలకు కాకుండా ఇష్టానుసారంగా అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.10 నుంచి రూ.20 అదనంగా చెల్లిస్తే బెల్టుషాపుల వారికి కావలసినంత మద్యం అందిస్తున్నట్లు సమాచారం. వాటిని తీసుకుని పల్లెలో బెల్టుషాపుల ద్వారా క్వార్టర్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తూ అమ్మకాలు చేస్తున్నారు. ఉదయం 11 గంటల వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరవరు.. ఈలోపు తాగేవారు బెల్టుషాపులను ఆశ్రయిస్తున్నారు. ఇక బెల్ట్‌షాపుల వారికి పెద్దమొత్తంలో మద్యం అమ్మేస్తుండటంతో ప్రభుత్వ మద్యం దుకాణంలో మిగిలిన మద్యానికి డిమాండ్ పెరుగుతోంది. దీంతో మందుబాబుల అవసరాన్ని బట్టి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కొత్తరకం బెల్టుషాపులు

బెల్ట్‌షాపులు ఇప్పుడు గతంలో లాగా నిర్వహించడం లేదు. బెల్టుషాపు నిర్వాహకులు ప్రభుత్వ మద్యం దుకాణం నుంచే రూ.10 లేదా రూ.20 అదనంగా చెల్లించి కావలసినన్ని మద్యం సీసాలు ఒకే సారి తీసుకెళ్లి ఇంట్లో లేదా దుకాణంలో పెట్టుకుంటారు. ఎవరైనా ఫోన్ చేసి ఫలానా చోట ఉన్నామని చెబితే వీరే అక్కడికి వెళ్లి బాటిల్‌పై రూ.50 నుంచి రూ.100 అదనంగా తీసుకుని మద్యం ఇచ్చి వస్తారు. ఫోన్‌పే చేసినా చాలు.. మందుబాబులు ఉన్న చోటుకే మద్యం చేరుస్తారు. దీంతో బెల్టుషాపులను అరికట్టడం పోలీసులకు సవాల్‌గా మారిందని అంటున్నారు.

ప్రేక్షక పాత్రలో ఎక్సైజ్ అధికారులు

ప్రభుత్వ మద్యం దుకాణాలలో మద్యం అధిక ధరలకు అమ్మకుండా చూడ్డంతో పాటు, బెల్టుషాపులు అరికట్టడంలో ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్టు ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ప్రేక్షకపాత్రతో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహించడంతో పాటు ఎమ్మార్పీకంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి మద్యం దుకాణాలలో ఎమ్మార్పీ రేట్లకే అమ్మేలా చర్యలు చేపట్టాలని మందుబాబులు కోరుతున్నారు.

> **బెల్టుషాపులు నిర్వహిస్తే జైలుకే**
>
> **- మంజుల, ఎక్సైజ్ సీఐ, బద్వేలు**
>
> ఎవరైనా బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు నిర్వహిస్తే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. బద్వేలు ఎక్సైజ్ పరిధిలో నెల వ్యవధిలో 50 మందిపై కేసు నమోదు చేసి 250 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నాం. పల్లెల్లో బెల్టుషాపుల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బెల్టుషాపులు నిర్వహిస్తూ వరుసగా నాలుగుసార్లు పట్టుబడితే పీడీయాక్ట్ నమోదు చేస్తాం.

ఎవడబ్బ సొత్తని ఏపీఎండీసీని తాకట్టు పెట్టారు

- **టీడీపీ, జనసేన నేతల మండిపాటు**



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్ర, చంద్రమోహన్

ఓబులవారిపల్లె, మార్చి 6: ఏపీఎండీసీని రాష్ట్ర ప్రభుత్వం ఎవడబ్బ సొత్తని తాకట్టు పెట్టిందని జనసేన, టీడీపీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. మంగంపేటలో బుధవారం ఏర్పాటు చేసిన జనసేన, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కార్యాచరణ సమావేశంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు కల్లా చలపతి, అనుమలగుండం చంద్రమోహన్ మాట్లాడారు. మీ తాత, తండ్రికి రాజకీయ భవిష్యత్తుకి ఆర్థిక అండగా నిలిచిన సంస్థను తాకట్టు పెట్టడం అంటే కన్న తల్లిని తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. ఏపీఎండీసీ సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో మంజూరైన వాటర్‌ప్లాంట్‌లు 68 వస్తే వాటిలో 66 చిత్తూరుకే తరలించారని, 12 కమ్యూనిటీ హాల్‌లు ఇస్తే మొత్తం చిత్తూరుకే కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో పుంగనూరు, పీలేరు ఇతర ప్రాంతాల వారే ఉన్నారని తెలిపారు.

స్థానిక యువతకు, ఏపీఎండీసీ కోసం భూములు, ఇళ్లను వారికి ఇప్పటికీ న్యాయం చేయలేదని, స్థానిక శాసనసభ్యులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. మంగంపేట సంస్థలో సీనియర్స్‌గా ఉన్న ఎస్సీ, బీసీ అధికారులను కాకుండా వారికి అనుకూలంగా పనులు చేయించేందుకే సీపీవోగా సుదర్శన్‌రెడ్డిని తెచ్చుకున్నారని ఆరోపించారు. సంస్థలో జరిగే అక్రమాలపై రాబోయే రోజుల్లో పూర్తి స్థాయిలో ఉద్యమిస్తామని తెలిపారు. తల్లి లాంటి సంస్థను తాకట్టు పెట్టేబదులు, ఇడుపులపాయ, బెంగళూరులో ఉన్న మీ ప్యాలస్‌లు తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చుకోవచ్చుకదా సీఎంగారూ అంటూ ఎద్దేవా చేశారు. డేంజర్ జోన్ పరిధిలో ఉన్న స్థానికులకు న్యాయం చేయాలని కోరిన తమపై కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థకు భూములు, ఇళ్లు ఇచ్చి కట్టు బట్టలతో బయటికి వెళ్లిన వారికి సరైన న్యాయం జరగలేదని, వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు అధికారంలోకి రాగానే తప్పు చేసి వారిపై చర్యలు తీసుకునేలా తమ అధిష్ఠానం నాయకుల దృష్టికి తీసుకొని వెళ్తామన్నారు. కార్యక్రమంలో జనసేన రాయలసీమ కన్వీనర్లు జోగినేని మణి, పగడాల వెంకటేష్, టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు గునిపాటి చెన్నరాయుడు, నారదాసు కృష్ణయ్య, పగడాల చంద్రశేఖర్, పసుపులేటి వెంకటరమణ, విజయ్‌కుమార్, వీరంద్ర, శివప్రసాద్, అనుమలగుండం హరికృష్ణ, మణి, సునీల్ తదితర టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించే సంస్కారం పెరగాలి



జిల్లా అధికారులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6 : సమాజంలో మహిళలకు సత్కారాలు అవసరంలేదని, వారికి సరైన గౌర వం ఇచ్చే సంస్కారం అందరిలో పెరగాల్సిన అవసరం ఉందని జిల్లా మహిళా అధికారులు అభిప్రాయపడ్డారు. బుధవారం స్టెప్ కార్యాలయంలో ప్రపంచ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకల్లో భాగంగా లయన్స్ క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు సరస్వతి మాట్లాడుతూ సమాజంలో మహిళ గురుతర బాధ్యత వహిస్తుందని, సమాజం ఉన్నతిలో ఆమె పాత్ర ఎన్నదగినదన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా మహిళలకు సరైన స్థానం లభిస్తున్నా వర్కింగ్ ప్లేస్‌తో పాటు పలు చోట్ల మహిళలకు వేధింపులు తప్పడంలేదని, మహిళల పట్ల చిన్న చూపు తగదన్నారు. అనంతరం స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమాధికారి వల్లూరు బ్రహ్మయ్య, హాస్టలు వెల్ఫేర్ ఆఫీసరు ఆరోగ్య, ఉపాధ్యాయురాలు సావిత్రి మాట్లాడారు.

వెనుకబడిన వర్గాలకు మహర్దశ
టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న యాటగిరి రాంప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో వెనుకబడిన తరగతులకు మహర్దశ లభించనుందని టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు యాటగిరి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ మంగళగిరిలో నాగార్జున యూనివర్సిటీ ప్రాంతంలో 10 అంశాలతో కూడిన బీసీ డిక్లరేషన్‌లో లక్షలాది మంది బీసీల సమక్షంలో ప్రకటించడం హర్షణీయమన్నారు. 50 సంవత్సరాలకే బీసీలకు రూ.4వేలు పెన్షన్ చట్టం, సబ్‌ప్లాన్ నిధులను లక్షా 50వేల కోట్లకు పెంచనున్నట్లు పేర్కొనడం, ఇలాంటి మరెన్నో హామీలు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యాదవ సాధికార సమితీ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, యాదవ్, ఆవుల వెంకటేశ్, పోలి సాయి, రాము పాల్గొన్నారు.

మైనార్టీ మంత్రిగా అంజద్‌బాషా క్రైస్తవులకు ఏం చేశారు
టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు



మాట్లాడుతున్న క్రిస్టియిన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 6 : మైనార్టీ మంత్రిగా అంజద్ బాషా క్రైస్తవులకు ఏం చేశారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాసు ప్రశ్నించారు. టీడీపీ హయాంలోనే క్రైస్తవులకు గుర్తింపు లభించిందని స్పష్టం చేశారు. బుధవారం కడప నగరం ద్వారకానగర్‌లో టీడీపీ క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో పాస్టర్ల సదస్సును కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 వైసీపీ మేనిఫెస్టోలో క్రిష్టియన్‌ల కోసం ఆరు వాగ్ధానాలు చేసి ఒక్కటి కూడా సీఎం జగన్ నెరవర్చలేదన్నారు. ప్రధానంగా విదేశీ విద్య, చర్చిల నిర్మాణం, జెరూసలేం యాత్ర ఇలా క్రైస్తవులకు అనేక సంక్షేమ పథకాలను చంద్రబాబు ప్రవేశపెట్టారన్నారు. అయితే క్రైస్తవులకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి క్రైస్తవులను విస్మరించారన్నారు. మైనార్టీ మంత్రిగా కడప జిల్లాకు చెందిన అంజద్ బాషా కూడా క్రైస్తవులకు మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. చంద్రబాబును సీఎంను చేసుకోవలసిన ఆవశ్యకత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, నమితారెడ్డి, చంద్రశేఖర్, కొమ్మలపాటి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్‌యాదవ్



రాయచోటిటౌన్, మార్చి 6: జిల్లా సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల శాఖ ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యుడిగా భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చీర్ల శ్రీనివాస్‌యాదవ్‌ను నియమిస్తూ కేంద్ర మంత్రి నారాయణ్‌రానే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతీ, యువకులు, యువ పారిశ్రామిక వేత్తలకు కేంద్ర ప్రభుత్వ సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు ప్రారంభించడానికి ఎన్నో అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

వైసీపీ రాక్షస పాలనను తరిమికొట్టాలి

● టీడీపీ కడప అభ్యర్థి మాధవీరెడ్డి




కడప: కరపత్రాలు అందిస్తున్న మాధవీరెడ్డి... కమలాపురం: టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 6 : రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలనను తరిమికొట్టాలని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరం 38వ డివిజన్ బిస్మిల్లానగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలను అందించారు. అలాగే టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు భయభ్రాంతులతో ఉన్నారని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మళ్లీ శాంతి నెలకొల్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫజిల్, ఆరిఫ్, నసీరుద్దీన్, ఫైజల్, ఆనిఫ్, ఆసిఫ్, నిజాముద్దీన్, సోహైల్, నవాజ్, కలీల్, ఎండీహెచ్‌బాషా, ఫరోజ్ ఖాన్, సుబ్బారెడ్డి, జిలానీబాషాతో పాటు అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కుటుంబ సభ్యులకు అండగా ఉంటా

కమలాపురం రూరల్, మార్చి 6 : వైసీపీ నిరంకుశ పోకడలు నచ్చకనే వైసీపీ నుంచి టీడీపీలోకి వస్తున్నారని, వారందరికీ తాను అండగా ఉంటానని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం 2వ వార్డులో మోహన్ బీడా కంపెనీ యజమాని తాజుద్దీన్ జియావుద్దీన్ కుటుంబ సభ్యులతో కలిసి 20 మంది టీడీపీలో చేరారు. వారికి పుత్తా పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు కమలాపురం అభివృద్ధిని గాలికివదిలేశారన్నారు. తమ సొంత ఆస్తిని కాపాడుకోవడానికి వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు తప్ప అభివృద్ధికి ఎక్కడా సహకరించలేదన్నారు. అందరం కలిసి చంద్రబాబును సీఎం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలోఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, దివాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, బాబుల్, నబీరసూల్, దాదిరామయ్య, కంకర సుబ్బారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మహేష్‌యాదవ్, మెరిన్ ప్రసాద్, ఎన్టీఆర్ రమణ, సుబ్బరాయుడు, నరసింహులు, సీయెన్ పాల్గొన్నారు.

ఐటీడీపీ నరసింహ కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దచెప్పలి గ్రామానికి చెందిన ఐటీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వగా బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఆ మొత్తాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. ఐటీడీపీ నరసింహ నరసింహులు, దివాకర్ రెడ్డి, రాఘవరెడి బాబుల్, నబీరసూల్, దాదిరామయ్య, కంకర సుబ్బారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మహేష్‌యాదవ్,మెరిన్ ప్రసాద్, ఎన్టీఆర్ రమణ, సుబ్బరాయుడు, పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : పుత్తా

పెండ్లిమర్రి, మార్చి 6: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాచునూరు పంచాయతీ పరిధిలోని చౌటపల్లె, మాచునూరు గ్రామాలలో టీడీపీ నాయకులు ఆరవేటి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పుత్తా నరసింహారెడ్డి బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డితో పాటు యువనాయకులు పుత్తా లక్ష్మీరెడ్డి, సాయి నరసింహారెడ్డి ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో వివరించారు. టీడీపీ నాయకులు ఆరవేటి చంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి,శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి, బ్రహ్మయ్య, మండల అధ్యక్షులు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ పోస్టరు విడుదల



పోస్టరును విడుదల చేస్తున్న శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6 : రాష్ట్రానికి విజనరీ కావాలి, ప్రిజనరీ వద్దనే టీఎన్ఎస్ఎఫ్ ముద్రించిన పోస్టర్లను టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి విజనరీ లీడర్ కావాలి, ప్రిజనరీ వద్దు అనేది నేటి యువత, విద్యార్థి నినాదమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అర్హతలేని ప్రజా ప్రతినిధులు, స్వార్థపరులు అధికారంలో ఉండడం వల్లనే విద్యార్థులు, యువతకు విదేశీ విద్య లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంటు రాదు, భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కని పీజీ డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగాలు దొరక్క గత ఐదేళ్లలో ఎంతో మంది నిరుద్యోగులు, విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఊరట కల్పిస్తుందని చెప్పారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్, ప్రధానకార్యదర్శి హమీద్, అనిల్, ఏటూరి లోకేశ్, సమీర్, శ్రీను, రంజిత్, సుదర్శనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో అఘాయిత్యాలను అరికట్టాలి: ఏబీవీపీ



నిరసన కార్యక్రమంలో ఏబీవీపీ నేతలు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో టీఎంసీ నాయకులు మహిళలపై చేస్తున్న అఘాయిత్యాలను అరికట్టాలని ఏబీవీపీ నాయకులు బుధవారం కడప నగరంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత కోదూరు మల్లిఖార్జున మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం దారుణమన్నారు. ఒక మహిళ ముఖ్యమంత్రిగా పరిపాలిస్తున్న ప్రాంతంలో మహిళలపై దుర్మార్గాలు సిగ్గుచేటన్నారు. ఏబీవీపీ నాయకులు పెంచలయ్య, అభిలాష్, పద్మావతి, శ్వేత పాల్గొన్నారు.

రైతులకు త్వరలో మంచి రోజులు: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వేంపల్లె, మార్చి 6: రైతులకు త్వరలో మంచి రోజులు రాబోతున్నాయని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్‌లు అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో రైతులకు సబ్సిడీలు, ఇన్సూరెన్సులు, సబ్సిడీకి డ్రిప్పు, ప్యాక్‌హౌస్‌లు, కంపోస్ట్ ఎరువుల తయారీ, నీటి నిల్వ కోసం సంపులు నిర్మించడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ అనేక విధాలుగా రైతులకు అండగా నిలబడిందన్నారు. అయితే ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రైతును నట్టేట ముంచిందన్నారు. జగన్ సొంత జిల్లాలోనే ఒక్క మండలానికి కూడా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తం గా ఉన్న రైతులకు ఏం న్యాయం చేస్తారన్నారు. కావున గత టీడీపీ హయాంలో రైతులకు జరిగిన మేలును గుర్తించి వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆర్వీరమేష్, టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి, గోటూరు నాగభూషణం, మహబూబ్ షరీఫ్, చంద్రమౌళినాయుడు, ఫయాజ్ బాష తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన సీఎం జగన్



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పులివెందుల టౌన్, మార్చి 6: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో బీసీలకు మాయమాటలు చెప్పి దారుణంగా మోశారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకునరకం చూపించిన ప్రభుత్వం ఏదైన ఉందంటే అది జగన్ ప్రభుత్వమే అన్నారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా తెచ్చిన ఈ డిక్లరేషన్‌లో పొందుపరిచిన విషయాలను అమలు చేయడానికి టీడీపీ, జనసేనపార్టీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా పార్లమెంట్ కార్యదర్శి గడ్డం అమర్‌నాథ్ యాదవ్, కడపపార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు లోమడ మురళియాదవ్, టీఎన్‌టీయూసీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అమీర్‌బాష, పసుపులేటి సంజీవ్, దేరంగుల అంకన్న పాల్గొన్నారు.

10న గురుకుల పాఠశాలలో ప్రవేశానికి పరీక్ష

పులివెందుల టౌన్, మార్చి 6: పులివెందుల సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2024-25 అకడమిక్ ఇయర్‌కు గాను ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం మరియు 5వ తరగతి ఇంగ్లీష్ మీడియం కోర్సులలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తేదీన ఆదివారం 5వ తరగతికి ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ వారికి మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో అప్లై చేయని వారికి గురుకుల పాఠశాలకు 10వ తేదీ ఉదయాన్నే చేరుకుంటే వెంటనే అప్లై చేసి వెంటనే పరీక్ష రాయించడం జరుగుతుందన్నారు.

టీడీపీ పాలనలోనే బీసీలకు ఉజ్వల భవిష్యత్తు

కడప (మారుతీనగర్), మార్చి 6: తెలుగుదేశం పాలనలోనే బీసీలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మడక చక్రధర్ పేర్కొన్నారు. బుధవారం ఐటీఐ సర్కిల్ సమీపంలో గల సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళగిరిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడితో పాటు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ బీసీలకు వరాల జల్లు కురిపించడం అభినందనీ యమన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీని ఎత్తివేస్తామనడంతో పాటు 50 సంవత్సరాల నుంచే పెన్షన్ ఏర్పాటు చేయడం, చేనేత వ్యవస్థకు అన్ని రకాలుగా సబ్సిడీలను పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడం శుభసూచకమన్నారు. కావున బీసీ వర్గాల ప్రజలంతా ఏకమై టీడీపీని గెలిపిం చుకోవాలన్నారు.

టీడీపీ బీసీ డిక్లరేషన్ అభినందనీయం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 6 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బీసీలకు డిక్లరేసన్ ఇవ్వడం హర్షించదగ్గ విషయమని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోయిలకుంట్ల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీల అభివృద్ధే ధ్యేయంగా చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిస్వామి, రజకసంఘం జిల్లా అధ్యక్షుడు హరి పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధే ధ్యేయంగా బీసీ డిక్లరేషన్

బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగపరంగా రాణించేలా జయహో బీసీ సభలో బీసీ డిక్లరేషన్ జరిగిందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

అందలమెక్కాలనే తాయిలాలకు తెర



కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

కడప (మారుతీనగర్), మార్చి 6: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి అందలమెక్కాలనే దురాశతో వలంటీర్ల ద్వారా తాయిలాలకు తెరలేపుతున్నారని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. వేల కోట్ల రూపాయలు దండుకుంటూ ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మార్చారని ఆరోపించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలను అప్రమత్తం చేసే క్రమంలో భాగంగా సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కళాజాతా చేపట్టారన్నారు. ఆ మేరకు గత ఫిబ్రవరి 25న విశాఖ నుంచి ప్రారంభించిన కళాజాతా 'ఓటేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అనే అంశంపై చేపట్టిన కళా జాతా ఇప్పటి వరకు 22 జిల్లా కేంద్రాలలో ప్రదర్శన పూర్తి చేసినట్లు వెల్లడించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో కళాజాత నిర్వహించారు. వలంటీర్లను ఎన్నికల విధులలో వినియోగించరాదని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించినా పాలక ప్రభుత్వం వలంటీర్లే మా ఎన్నికల రథసారథులని ప్రకటించడం సరైందికాదన్నారు.

ఆటాపాటలతో ఆకట్టుకున్నవేదిక

రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఆర్.రాజేష్ సారథ్యంలో రాష్ట్ర కళాజాతా బృందం ఓటర్లను చైతన్యం చేస్తూ ఆటాపాటలతో ఆకట్టుకున్నారు. ప్రజా ఉద్యమకారులు జి.ఈశ్వరయ్య, లోక్ సత్తా ఉద్యమనేత శ్రీకృష్ణ, మానవతా స్వచ్ఛంద సంస్థ నేతలు రామాంజులురెడ్డి పి. సుబ్బరాయుడు, న్యాయవాది సుబ్రమణ్యం, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీయంలు నాయకుల తలరాతలు మారుస్తాయి



మాట్లాడుతున్న సయ్యద్ మక్బూద్

కడప (నాగరాజుపేట), మార్చి 6 : ఈవీయంలు నాయకుల తలరాతలు మారుస్తాయని ముస్లిం ముక్తి మోర్చా నాయకుడు సయ్యద్ మక్బూద్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలో గల అజ్మీర్ ఫంక్షన్‌హాలులో ఆప్‌కి ఆవాజ్ ఆధ్వర్యంలో ఈవీఎంలపై వారు మాట్లాడారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, ఎన్ఆర్‌జేఏసీ కన్వీనరు అహ్మద్ బాషా, జాకీర్ మౌలానా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థలో ఈవీఎం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. కావున ప్రజలు ఆలోచించి మంచి నిర్ణయానికి రావాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ పార్టీలు బీజేపీకి వంత పాడుతున్నాయ న్నారు. బీజేపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఖాదర్ బాషా, అల్‌మేవా నాయకులు డాక్టర్ ఫరూక్, ఎన్నికల ఉర్దూ ఉపాధ్యాయ నాయకులు హిదయతుల్లా, అజ్మతుల్లా, అన్వర్, ఆప్‌కి ఆవాజ్ నగర కార్యదర్శి ఆబిద్‌హుసేన్, జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

మెస్, కాస్మటిక్ చార్జీలను విడుదల చేయాలి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6 : ప్రభుత్వ వసతిగృహాల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు మెస్, కాస్మటిక్స్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఆర్ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల ప్రచారం సమయలో సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు పెరిగిన ధరలకనుగునంగా మెస్, కాస్మటిక్స్ చార్జీలను పెంచి విద్యార్థులకు సన్నబియ్యం సరఫరా చేస్తామని మెనూలో మార్పు చేసి పౌష్టికాహారం అందిస్తామని, ప్రతి నెలా మెస్, కాస్మటిక్స్ బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారని, తక్షణం చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బకాయిలు వెంటనే విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6 : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగులో ఉన్న జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, ఉపాధ్యక్షుడు మనోజ్ డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం బాలాజీనగర్ యూత్ హాస్టలు ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగులో ఉన్న బకాయిలను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నా వారు సర్టిఫికెట్ కోసం విద్యా సస్థలకు వెళితే ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను వేధిస్తున్నాయన్నారు. విద్యార్థులకు అండగా మేనమామగా ఉంటానన్న జగనన్న ఫీజులు సకాలంలో చెల్లించకుండా వేధిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హరి, విద్యాసాగర్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

నాక్ పీర్ టీం సభ్యుడిగా ప్రొఫెసరు సుధాకర్‌రెడ్డి



కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6 : కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగంలో ప్రొఫెసరుగా పని చేస్తున్న డాక్టర్ బుసిరెడ్డి సుధాకర‌రెడ్డిని నాక్ పీర్ టీం సభ్యుడిగా ఎంపిక చేసినట్లు నాక్ డైరెక్టరు ప్రొఫెసరు కన్నబిరాం గణేశన్ ఈమెయిల్ ద్వారా సమాచారం అందించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డికి ఉన్న బోధన పరిశోధన అనుభవం, పత్రాలు, పరిశోధక ప్రాజెక్టులు పరిశోధన విద్యార్థుల పర్యవేక్షణ, పోస్టు డాక్టరల్ అనుభవం, హెచ్ ఇండెక్స్ గూగుల్ స్కాలర్ స్కోపస్ వెబ్ ఆఫ్ సైన్స్ ఇండెక్స్ విద్వాన్ ప్రొఫైల్ ఓఆర్‌సీ ఐడీ ప్రొఫైల్, ఏడీ ఇండెక్స్ ఆధారంగా నాక్ టీం సభ్యుడిగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

'అబద్ధాలతో అధికారంలోకి వచ్చి నగరాన్ని అధోగతి పాలు చేశారు'



మాట్లాడుతున్న శివకొండారెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6 : అబద్ధాలతో అధికారంలోకి వచ్చి కడప నగరాన్ని అధోగతిపాలు చేశారని టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం విస్మరించి ప్రజా వ్యతిరేక పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందన్నారు. వైసీపీ హయాంలో బీసీలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. అంజద్‌బాషా ముస్లిం మైనార్టీలకు మొండి చేయి చూపారన్నారు. పేరుకే కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని తెలిపారు. అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయ ఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయకుమార్, పెనుబాల ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంజుమియా పార్కు ప్రారంభం

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6 : కడప నగరం గుంతబజారులో ఖాన్‌బహద్దుర్ హకీం మంజుమియ్యా పార్కును బుధవారం ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు మంజుమియా సుపరిచితుడని, ఆయన ఒక మహావ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ముస్లిం పెద్దలు వలీవుల్లాఉసేనీ, మహ్మద్ అలీ బాగ్దాది, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రేపు మల్లికార్జున స్వామి కల్యాణం

కడప (కల్చరల్), మార్చి 6: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కడప నగరం ఉక్కాయపల్లె లే-అవుట్ (వైఎస్ఆర్ కాలనీ) కొండపైన వెలసిన ఊరకొండ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఈనెల 8వ తేదీన మధ్యాహ్నం 12.03 గంటలకు మల్లికార్జున స్వామి, అమ్మవార్ల కల్యాణం జరుపనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అప్పరాజు వెంకట ప్రసాద్‌శర్మ తెలిపారు. కావున భక్తులు హాజరై స్వామివారి సేవలో తరించాలని ఆయన కోరారు.

హామీలు అమలు చేయాలి: సీఐటీయూ

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 6 : ఎన్నికల ముందు కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంటు చేస్తామని ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలని సీఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి మనోహర్ కోరారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో దాదాపు 25వేల మంది దాకా రాష్ట్రంలో మూడున్నరల లక్షలమంది కంట్రాక్టు కార్మికులు ఉన్నారన్నారు. కేవలం 10,500మందిని మాత్రమే పర్మినెంటు చేస్తామని సీఎం ప్రకటించారన్నారు. అందరినీ పర్మినెంటు చేస్తామని చెప్పి కొందరిని చేయకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. సీఎం ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటియు అధ్యక్ష కార్యదర్శులు దాసరి విజయ్, ఏసుదాసు, నాగన్న, శేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు

● జిల్లా ఎన్నికల నియంత్రణ పర్యవేక్షణాధికారి ప్రవీణ్‌చంద్



మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప(కలెక్టరేట్), మార్చి 6: ఎన్నికల విధులకు సంబంధించి నిర్లక్ష్యం తగదని జిల్లా ఎన్నికల నియంత్రణ పర్యవేక్షణ అధికారి, నగర కమిషనరు ప్రవీణ్ చంద్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా అదనపు ఎన్నికల అధికారి, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలిసి కడప, ప్రొద్దుటూరు నియోజకవర్గాల ఈ ఆర్వోలు, సెక్టోరియల్ అధికారులతో ఎన్నికల్లో నిర్వహించాల్సిన బాధ్యతలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో సెక్టోరియల్ అధికారులు బాధ్యత చాలా ముఖ్యమైనదన్నారు. వారి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను, మౌలిక సదుపాయాలను సమకూర్చాలన్నారు. సర్వశిక్ష అభియాన్ నుంచి ఎంఈఓలకు నిధులు ఇస్తారని, పంచాయితీ రాజ్ శాఖ ద్వారా పనులు పూర్తి చేయాలన్నారు. సెక్టోరియల్ అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదికలను పంపించాలన్నారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కడప, ప్రొద్దుటూరు నియోజక వర్గాల సెక్టోరియల్ అధికారులు, ఆర్వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి ఆలయ ఈఓగా విశ్వనాథ్‌రెడ్డి



బాధ్యతలు చేపడుతున్న విశ్వనాథ్‌రెడ్డి

వేంపల్లె, మార్చి 6: వేంపల్లెలో పవిత్ర పాపాఘ్ని నది ఒడ్డున వెలఇసన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం నూతన ఈఓగా రామిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు వృషభాచలేశ్వర అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో విశ్వనాథ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారని ఆలయ పాలక మం డలి చైర్మన్ కురాకుల వెంకటేష్ తెలిపారు. ఇక్కడ ఈవోగా పనిచేసిన శ్రీధర్ కడపలోని గ్రూప్ టెంపుల్స్ ఈఓగా కొనసాగుతున్నట్లు తెలిపారు.

విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి

సీకేదిన్నె, మార్చి 6: విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి అనూరాధ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లెలోని విష్ణు విద్యామందిర్ హైస్కూలులో సైన్స్‌ఫేర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ ద్వారా ఎన్నో అద్భుతాలు సాధించవచ్చని విద్యార్థులు మక్కువ పెంచుకుని సైన్స్‌లో రాణించాలన్నారు. విద్యార్థులు చేసిన వివిధ నమూనాలను పరిశీలించారు.ఎంఈవో వెంకటరామిరెడ్డి, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్ శ్రీనివాసులరెడ్డి, ఎండీ ఫణిభూషణ్‌రెడ్డి, డైరెక్టర్లు వింధ్యామణి, కీర్తిరెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంగమ్మ తిరుణాల ఆర్చీ ప్రారంభం

సీకేదిన్నె, మార్చి 6: చింతకొమ్మదిన్నె మండలం మూలవంక వద్ద కొత్తగా నిర్మించిన గంగమ్మ తిరుణాల ఆర్చీని బుధవారం చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి ప్రారంభించారు. కొత్తవారు సైతం కొనుగొనేందుకు ఈ ఆర్చీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఈఓ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వీడియో గ్రాఫర్ల బాధ్యతలు కీలకం

కడప(కలెక్టరేట్), మార్చి 6: ఎన్నికల విధుల్లో భాగంగా వీడియో గ్రాఫర్ల బాధ్యతలు కీలకమైనవని జిల్లా మాస్టర్ ట్రైనర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో సాధారణ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎంసీఎంసీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల విధుల్లో వీడియో గ్రాఫర్ల పాత్ర అనే అంశంపై వీడియో గ్రఫీ టీమ్ నోడల్ అధికారి సురేష్ రెడ్డి, మల్లికార్జున, ఎక్స్‌పెండేచర్ నోడల్ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీడియో గ్రాఫర్లకు అవగాహన కల్పించారు.

రేపు మహిళలకు ఉచిత ఓపీ, ఎక్స్‌రే పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 6 : కడప నగరం రాజీవ్‌మార్గ్ రోడ్డు విద్యాసాగర్ హాస్పిటల్‌లో ఈ నెల 8న ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఎముకలు, కీళ్ల వ్యాధులపై మహిళలకు ఉచిత ఓపీ, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ విద్యాసాగర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8న ఉదయం 10గంల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉచిత వైద్య శిబిరం ఉంటుందన్నారు. అలాగే ఎముకలు, కీళ్ల సంరక్షణ కోసం అవగాహన సదస్సు ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7337003322 నెంబరుకు ఫోను చేసి రిజిస్ట్రేషన్‌కు సంప్రదించాలని కోరారు.

క్రమశిక్షణ, పట్టుదలతో ఉజ్వల భవిష్యత్తు

● వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్



మాట్లాడుతున్న వైవీయూ వీసీ సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6 : క్రమశిక్షణ, పట్టుదలతో ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. బుధవారం శిల్పారామంలో శ్రీహరి డిగ్రీ కళాశాల 14వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివితే మంచి గుర్తింపు లభిస్తుందని అలాగే విద్యలో కూడా ముందంజలో ఉండవచ్చన్నారు. రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, ఎస్వీ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ హరినారాయణ, శ్రీహరి డిగ్రీ కళాశాల సి.విజయభారతి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీహరి డిగ్రీకళాశాల వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు నిర్వహించినసాంస్కృతికకార్యక్రమాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశారు.

ఆకృతి షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన అనసూయ



మాట్లాడుతున్న సినీనటి అనసూయ

జమ్మలమడుగు, మార్చి 6: జమ్మలమడుగు పట్టణంలో ఆకృతి షాపింగ్‌మాల్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని సినీనటి అనసూయ పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపాన ఆకృతి షాపింగ్‌మాల్‌ను అనసూయ ప్రారంభించారు. ముందుగా ఆమె 11.15 గంటలకు అక్కడకు చేరుకోవడం జరిగింది. షాపింగ్‌మాల్ ఎదురుగా అప్పటికే ప్రజలు భారీగా చేరుకోవడంతో పోలీసులకే దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. అనసూయ స్టేజీ వద్దకు పోలీసుల సాయంతో వెళ్లారు. ఎట్టకేలకు స్టేజీ వద్దకు వాహనంలో వచ్చారు. అక్కడ అనసూయ ప్రజలకు అభివాదం చేసి సందడి చేశారు. అనంతరం ఆకృతి షాపింగ్‌మాల్ ప్రారంభించి ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో షోరూం అధినేత తాండవక్రిష్ణ, సాయి, రమణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా అనసూయ రాకతో తాడిపత్రి రోడ్డు, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద భవనాలు, రోడ్లపై జనాల రద్దీ పెరిగింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ప్రజా ఆశీర్వాద యాత్రకు విశేష స్పందన

బద్వేలు టౌన్, మార్చి 6 : టీడీపీ యువ నాయకుడు రితీష్‌రెడ్డి చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర బుధవారం పట్టణంలోని నాగులచెరువు కట్ట ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభించారు. ఈయన వెంట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న ఉన్నారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కట్టవీధి, ఎగువ బ్రాహ్మణవీధి, దిగువ బ్రాహ్మణవీధి, అబ్బరాతివీధి, మంగళివీధి, తాళిం వద్ద ఉన్న ముస్లిం బజారులలో కొనసాగింది. ఈ సందర్భంగా ఇంటింటి వద్ద కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో 5వవార్డు టీడీపీ నాయకులు సింగరయ్య, సుబ్రహ్మణ్యం, గనుమంతు రాజేష్, ప్రశాంత్, సిరాజుద్దీన్, సింగసాని గురురాజారావు, సింగసాని విజయకుమార్, సీనియర్ అడ్వకేట్ పీవీఎన్ ప్రసాద్, కొంకుల రమణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, కౌన్సిలరు మహ్మద్‌హసన్. నాగిరెడ్డిశివమ్మ, మిత్తికాయల సునీతయాదవ్, రైల్వే కాంట్రాక్టరు ఆర్వీ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన సీనియర్ అడ్వకేట్ పీవీఎన్ ప్రసాద్

బద్వేలు రూరల్, మార్చి 6 : ప్రముఖ న్యాయవాది, ఆర్యవైశ్య సంఘం నాయకుడు పీవీఎన్ ప్రసాద్ బుధవారం యువ నాయకుడు రితీష్‌రెడ్డి చేపట్టిన ప్రజా ఆశీర్వాదయాత్రలో టీడీపీలో చేరారు. రితీష్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పీవీఎన్ ప్రసాద్ చేరికతో పార్టీ బలోపేతం అవుతుందని యువనేత రితీష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మానవత విలువలతో జీవించాలి

ఎర్రగుంట్ల, మార్చి 6: ప్రతి ఒక్కరూ మానవత విలువలతో జీవించాలని మానవత స్వచ్ఛంధ సేవాసంస్థ కెరీర్ గైడెన్స్ ఛైర్మన్, కేంద్ర కమిటీ డైరెక్టర్ రాటాల గోపి పిలుపునిచ్చారు. బుధవారం ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో హెడ్‌మాస్టర్ రామాంజనేయరెడ్డి అధ్యక్షతన మానవత స్వచ్ఛంధ సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు-నైతికవిలువ, కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మానవత సంస్థ సేవలు నచ్చి గణిత మాస్టర్ గురుభాస్కర్‌రెడ్డి రూ. 5000 విరాళాన్ని నగదురూపంలో ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఛైర్మన్ రఘురామిరెడ్డి, కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ బాలఎల్లారెడ్డి, మండల కన్వీనర్ మేడా రమేష్‌బాబు, కార్యదర్శి సుబ్బరాయుడు, ఈసీమెంబరు సాంబశివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికుల ధర్నా

బద్వేలు, మార్చి6: మున్సిపల్ ఉద్యోగ,కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ వర్కర్స్ ,ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ కోశాధికారి కె.శివకుమార్ మాట్లాడుతూ విధులకు హాజరు కాని రెగ్యులర్ కార్మికుల నుంచి డబ్బులు తీసుకుని జీతం వేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ క్రిష్ణకు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పట్టణ కార్యదర్శి నాగార్జున, ఐద్వామహిళా సంఘం నాయకురాలు మోక్షమ్మ, శ్యామ్, నాగేంద్రబాబు, హరి, దేవమ్మ, సత్యరాజు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ భూములు ఇవ్వాలి

పోరుమామిళ్ల, మార్చి 6 : అక్కల్‌రెడ్డిపల్లె, కృపానగర్ గ్రామాల్లో భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం భూ పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ గ్రామాలకు చెందిన పేదలతో కలిసి తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం వీఆర్వో జహీర్‌బాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దాసరి వెంకటేశ్, సగిలి గురయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలను పట్టించుకోకపోవడం దారుణం

జమ్మలమడుగు, మార్చి 6 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడానికి పాదయాత్రలో ఇష్టమొచ్చినట్లు అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ విమర్శించారు. బుధవారం జమ్మలమడుగులోని ఎన్జీవో హోం నందు ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, కార్మికులను పర్మినెంట్ చేస్తానని జగన్ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి విజయ్, యేసుదాసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగన్న, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

పోరుమామిళ్ల, మార్చి 6 : మండలంలోని టేకూరుపేట పంచాయతీలో సుమారు రూ.19 లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీ కాంప్లెక్స్‌ను రూ.5 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంటు, తిమ్మారెడ్డిపల్లెలోని హెల్త్ క్లినిక్ ,రామాలయం గుడికి శంకుస్థాపన, విలేజీ క్లినిక్‌ను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పంచాయతీరాజ్ సలహాదారుడు నాగార్జునరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆప్కో డైరెక్టరు కళ్యాణ్‌చక్రవర్తి, మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, రాజశేఖర్, టేకూరుపేట సర్పంచ్ రమణారెడ్డి , రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాశ్‌రెడ్డి, తిమ్మారెడ్డిపల్లె సర్పంచ్ ఉమా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పోరుమామిళ్లలోని ఆర్మీ మాజీ జవాన్ల ఆధ్వర్యంలో నిర్మించిన బసంతల్ ఈఎస్ఎం కమ్యూనిటీ హాలును వారు ప్రారంభించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు

కడప(కలెక్టరేట్), మార్చి 6: ఎన్నికల విధులలో నిర్లక్ష్యం తగదని జిల్లా ఎన్నికల నియంత్రణ పర్యవేక్షణ అధికారి, నగర కమిషనరు ప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా అదనపు ఎన్నికల అధికారి, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలిసి కడప, ప్రొద్దుటూరు నియోజకవర్గాల ఈఆర్వోలు, సెక్టోరియల్ అధికారులతో ఎన్నికల్లో నిర్వహించాల్సిన బాధ్యతలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప, ప్రొద్దుటూరు నియోజక వర్గాల సెక్టోరియల్ అధికారులు, ఆర్వోలు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక



ప్రొద్దుటూరు.. శ్రీరాంనగర్ దొరసానిపల్లె రోడ్డులలో ప్రచారంలో పాల్గొన్న సీఎం సురేశ్‌నాయుడు లింగారెడ్డి ముక్తియార్, భాకరాపేట, వైఎస్‌నగర్ ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కొత్తపల్లెపంచాయతీ జేమ్స్ కొట్టాలు, సుందరయ్యకాలనీ ప్రచారంలో పాల్గొన్న ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు ,మార్చి 6 : తెలుగు దేశం పార్టీకి బీసీలే వెన్నెముకని టీడీపీ నాయకుడు సీఎం సురేష్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం 38 వవార్డు శ్రీరాంనగర్, దొరసానిపల్లె రోడ్డు, శ్రీనగర్‌కాలనీ, సాయిరాం నగర్ కాలనీలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్ళి సైకిల్ గుర్తుకు ఓటేయ్యమని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ ఛైర్మెన్ వీఎస్ ముక్తియార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఈవీ సుధాకర్‌రెడ్డి, బీసీనేత నల్లబోతు నాగరాజు, ఖలీల్,మాజీ కౌన్సిలర్ గంజికుంట ఆంజనేయులు, జనసేన ప్రతినిధి జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబే సీఎం కావాలి : వరద

ప్రొద్దుటూరు, మార్చి 6 : రాష్ట్రం బాడుపడాలంటే చంద్రబాబే ముఖ్యమంత్రికావాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు.బుధవారం గోపవరం పంచాయతీ వైఎస్ నగర్, భాకరాపేట పొట్టిపాడు రోడ్డులలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాబు ప్రకటించిన ఆరుగ్యారెంటీల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ఆసంరఘురామిరెడ్డి, నాగమునిరెడ్డి, ద్వారక చర్ల రాఘవరెడ్డి,ఈశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి దేవిరెడ్డి జయరామిరెడ్డి, పోలక భాస్కర్‌రెడ్డి, శేకర్‌రెడ్డి, ధనిరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ దౌర్జన్యాలు భూదందాలు పోవాలంటే టీడీపీ రావాలి: ప్రవీణ్

ప్రొద్దుటూరు, మార్చి 6 : రాష్ట్రంలో వైసీపీ దౌర్జన్యాలు భూదందాలు పోవాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొత్తపల్లె పంచాయతీలోని జేమ్స్‌కొట్టాలు, సుందరయ్యకాలనీలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఇంటింటికి వెళ్ళి సైకిల్ గుర్తుకు ఓటేయ్యమని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆవుల దస్తగిరి, జోన్నవరపు ప్రసాద్‌రెడ్డి, సుబ్బరాయుడు, రాయపాటి దేవదాసు, మండల టీడీపీ కన్వీనర్ బాబుల్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మెన్ బండి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని ఆశీర్వదించాలని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ సతీమణి బొజ్జ అరుణ అన్నారు. బుధవారం పోరుమామిళ్లలోని 1వ వార్డు కాపువీధుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీలో భాగంగా టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోపథకాలు వివరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్, మార్కెట్‌యార్డుమాజీ ఛైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, మాజీ సర్పంచ్‌లు రహ్మత్‌ఈ నౌజియా, హబీబున్నీసా, కల్వకూరి చిన్న వెంకటసుబ్బయ్య, శీతా వెంకటసుబ్బయ్య, కొండా రామక్రిష్ణారెడ్డి, ఇమాంహుసేన్, నడిపి వెంకటసుబ్బయ్య, సెట్టెం ప్రతాప్, డ్రైవరు ఎస్ ఎంబాషా, తిరుమలశెట్టి సుబ్బారావు, ఎంపీటీసీ కల్వకూరి రమణ, రంతుల్లా, బండి ఓబులేసు, కరీముల్లా, అతికారి రాజా, రంతుల్లా, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: టీడీపీని ఆదరించాలని భూపేశ్‌రెడ్డి భార్య జ్యోతి, ఆయన తల్లి సరస్వతి ఇంటింటికి వెళ్లి విజ్ఞప్తి చేశారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని 17వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు భాగ్యమ్మ, దేవమ్మ, మరియమ్మ, వెంకటలక్ష్మి, మల్లికార్జున, సయ్యద్, తిరుమలకొండు, ఖలందర్, మహబూబ్ బాష, సద్దాం, షబ్బీర్, నాగమోహన్, దాదాఖలందర్, మదార్‌వలి, శ్రీనివాసులు, నాయబ్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.



ముద్దనూరులో ప్రచారం చేస్తున్న భూపేశ్‌రెడ్డి

ముద్దనూరు..: చంద్రబాబు ప్రభుత్వంలోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధి వేల్పుచర్ల గ్రామంలో బుధవారం బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.అందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, వేల్పుచర్లబాబు, శివరామిరెడ్డి, రంగారెడ్డి, సాంబశివారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, మల్లేష్, సీతారామయ్య, ఓబులేసు, ఓబయ్య, రాజమునీంద్ర,టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అట్లూరులో ప్రచారం చేస్తున్న రితీష్‌రెడ్డి, బొజ్జ రోశన్న

అట్లూరు..: మండలంలోని రెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ఇంటింటి కార్యక్రమంలో భాగంగా టీడీపీ యువ నాయకుడు రితీష్‌రెడ్డి, బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరిస్తూ కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మండల సీనియర్ నాయకుడు బోవిళ్లనందగోపాల్‌రెడ్డి, కడప పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షురాలు పాలకొండు సుధారాణి, పాటూరు రాధాక్రిష్ణారెడ్డి, చిలిపి క్రిష్ణారెడ్డి, అరవ పెద్ద రామసుబ్బారెడ్డి, చిన్న రామసుబ్బారెడ్డి, మాజీమండల అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, పోతిరెడ్డి, రెడ్డయ్య, మహేశ్వర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, మస్తాన్, మద్దిక పుల్లారెడ్డి, కొల్లువెంకటసుబ్బారెడ్డి, మన్యం వేణుగోపాల్‌రెడ్డ, శివయ్యస్వామి, సుధాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కొత్తపి నరసింహులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపాలెం..: మండల పరిధిలోని ఉప్పలపాడు, దద్దనాల, కూలూరు గ్రామాల్లో టీడీపీ ఇన్‌ఛార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరుపథకాల పథకాన్ని ప్రజలకందించి టీడీపీ సైకిలు గుర్తుకు ఓటు వేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పెరుగు నాగరాజు, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనివాసులులుయాదవ్, ముద్దం సుధాకర్, ముద్దం సుబ్రహ్మణ్యం, మండల కన్వీనరు విశ్వనాథరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8న నగరేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 3: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో పార్వతీ సమేత నగరేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు తెలిపారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామని రాత్రి 9 గంటలకు నగరేశ్వర స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు స్వామివారి కల్యాణం తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు ప్రారంభం

బద్వేలు, మార్చి6: బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం నుంచి డయాలసిస్ సేవలు ప్రారంభమయ్యాయి. స్థానిక సీమాంక్ హాస్పిటల్ ప్రాంగణంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాంప్రసాద్, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమాదేవి, వైద్యాధికారులు, ప్రజా ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

మైదుకూరు, మార్చి 6 : మహాశివరాత్రి సందర్భంగా మైదుకూరు డిపో నుంచి శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లంకమలకు 12 బస్సులు, కాశినాయన జ్యోతికి 9, అల్లాడుపల్లెకు 9 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, 8వ తేదితెల్లవారుజాము నుంచి 24 గంటల పాటు బస్సులుంటాయన్నా రు.

డీఎస్పీగా వెంకటేశులు



మైదుకూరు, మార్చి 6 : మైదుకూరు డీఎస్పీగా టి.వెంకటేశులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వంశీధర్‌గౌడ్‌ను ఎన్టీఆర్ జిల్లా ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేయగా అక్కడున్న వెంకటేశులు మైదుకూరుకు బదిలీపై వచ్చారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి

పోరుమామిళ్ల, మార్చి 5 : జగనన్నవిద్యాదీవెన, వసతిదీవెన జాడ ఎక్కడ, పెండింగులో ఉన్న బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవి పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

రోడ్డెక్కిన మురుగునీరు



మోరగుడి బిందెల వీధిలో రోడ్డుపై చేరిన మురుగునీరు

జమ్మలమడుగు, మార్చి 6: జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో డ్రైనేజీ కాలువలు శుభ్రంచేయక కంపుకొడుతున్నాయి. ప్రధాన రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ కాలువలు వ్యర్థాలతో నిండాయి. బిందెలవీధిలో డ్రైనేజీ కాలువ నిండి వ్యర్థాలు శుభ్రం చేయక డ్రైనేజీ నీరు రోడ్డుపై చేరింది. అంగన్వాడీ సెంటర్-3 ఎదురుగా కాలువ వ్యర్థాలు నిండి కంపుకొడుతోందని, విద్యార్థులకు తీవ్ర అసౌకర్యంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుపై చేరిన మురుగునీరులో అంగన్వాడీ పాఠశాలకు వచ్చిన చిన్నపిల్లలు నడిచి వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. అపరిశుభ్రంగా ఉండడం వలన చిన్నపిల్లలకు దోమలు కుట్టి జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని అనేక సార్లు తెలియజేసినా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు తెలిపారు. ఈ సమస్యకు సంబంధించి మోరగుడి గ్రామ సర్పంచ్ కొండయ్యను 'ఆంధ్రజ్యోతి' సమస్యను వివరించగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే పారిశుధ్య కార్మికులు మాత్రం తమకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని వాపోయారు. ఈ సమస్యకు అధికారులు చర్యలు చేపట్టి పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కోలాటం మహిళా బృందానికి ఘన సన్మానం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 6: అరుణాచలంలో 14 కిలోమీటర్లు కోలాటం చేస్తూ గిరి ప్రదర్శన చేసిన మహిళా బృందానికి మన ప్రజా సేవా సమితి కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. పట్టణానికి చెందిన 111 మంది మహిళలు మల్లికాబండి, మాస్టర్ సాయిభరత్ ఆధ్వర్యంలో గిరి ప్రదర్శన చేశారు. ఆ మహిళలను కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, 13వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాష చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.మనప్రజాసేవా సమితి అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, గౌరవాధ్యక్షుడు మహబూబ్, ఉపాధ్యక్షుడు బీటెక్ బాష, ప్రధాన కార్యదర్శి హరియాదవ్, నరసింహ, సహాయ కార్యదర్శి మహేష్, మస్తాన్ వలి, జహీర్, యూసఫ్, గురప్ప, ఆయాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మొల్ల జయంతి వేడుకలు ప్రారంభం

గోపవరం, మార్చి 6 : మండలంలో మొల్ల జయంతి వేడుకలు గురువారం ప్రారంభించనున్నట్లు మొల్లసాహితీపీఠం వ్యవస్థాపకుడు గానుగపెంట హనుమంతరావు తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఏడురోజులు నిర్వహించి చివరగా 14న విజయోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

9.10 తేదీలలో పౌరహక్కుల సంఘం మహాసభలు

ప్రొద్దుటూరు ,మార్చి 6 : ఐదు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాలలో పౌరహక్కుల కోసం పనిచేస్తున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహాసభలు ఈ నెల 9,10 తేదీలలో హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుపుకుంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు తెలిపారు. బుధవారం స్థానిక సృజనా సామాజిక వేదిక కార్యాలయంలో 50 వసంతాల పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహా సభల పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విరసం మాజీ కార్యదర్శి వరలక్ష్మీ,మిత్రజ్యోతిసాహితీ సంస్థ కార్యదర్శి కవి మహమూద్, జనవిజ్ఞానవేదికప్రతినిధిశ్రీరాములు, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, సృజనా సామాజిక వేదిక కన్వీనర్ శ్రీను, ఆర్‌వీఎస్ కన్వీనర్ హరిత,మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి పాల్గొన్నారు.


'షర్మిలను జమ్మలమడుగు నుంచి పోటీ చేయమని కోరాం'

ఎర్రగుంట్ల, మార్చి 6: కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను జమ్మలమడుగు నుంచి ఎమ్మెల్యేగా పోటీచేయమని కోరామని ప్రభుత్వ వ్యవసాయ మాజీ ప్రధాన సలహాదారు, తిప్పలూరు సర్పంచ్ అంబటి క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం విజయవాడలో షర్మిలను కలిసి ఈమేరకు వినతి పత్రాన్ని ఇచ్చినట్లు తెలిపారు. జమ్మలమడుగులో పుట్టిన షర్మిల ఇక్కడి నుంచి పోటీ చేస్తే తామంతా మద్దతు ఇస్తామన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసల వెల్లువ

చాపాడు, మార్చి 6: మండలంలోని లక్ష్మీపేట, వీరభద్రాపురం, కేతవరం గ్రామాలకు చెందిన 60 వైసీపీ కుటుంబాలవారు బుధవారం టీడీపీలో చేరారు. మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరినవారిలో మాజీ ఎంపీపీ గురివిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కార్తీక్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మరో 50 కుటుంబాలవారు ఉన్నారు. ఈ కార్యక్రమానికి ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాగా లక్ష్మీపేట, వీరభద్రాపురం, కేతవరం గ్రామాల్లో సుధాకర్‌యాదవ్ బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నారపురెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, మేకలబాబు, సుదర్శన్, గోర్ల పెద్దసుబ్బరాయుడు, నందిమండల కృష్ణారెడ్డి, జనసేన మైదుకూరు ఇన్‌చార్జి మల్‌హోత్రా, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: వైసీపీ ప్రభుత్వం విధానాల పట్ల ప్రజలు విసిగిపోయారని, ప్రజల్లో వైసీపీ ప్రభుత్వం నమ్మకం కోల్పోయిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త రితీష్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 24వ వార్డు వెంకటయ్యనగర్ కాలనీలో సిటీకేబుల్ ఛైర్మన్ రాగిమాను ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి వంద కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా రితీష్‌కుమార్‌రెడ్డి రాగిమాను ప్రతాప్‌కుమార్, సీనియర్ న్యాయవాది పీవీఎన్ ప్రసాద్ తదితర కుటుంబాలకు టీడీపీ కండువా కప్పి ప్రత్యేకంగా ఆహ్వానించారు. వైసీపీ నుంచి రాగిమాను ప్రతాప్‌కుమార్, వైసీపీ కౌన్సిలరు రవితేజ, ప్రముఖ సీనియర్ న్యాయవాది పీవీఎన్ ప్రసాద్, తుంగా బ్రదర్స్, తుంగా సుబ్బయ్య, పిచ్చయ్య, శేషయ్య, బర్మనూపర్‌బజారు వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, ఆర్యవైశ్యులు చెవుల సుబ్బారావు, సి.వెంకటసుబ్బయ్య, సతీష్, కటారు బ్రదర్స్, చంద్రకాంతం నారాయణ బ్రదర్స్ తదితరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ కె.ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ, పసుపులేటి రమణ, మస్తాన్ బాబు, వెంకటసుబ్బయ్య, సింగసాని విజయ్, ఆదినారాయణ, రంతు, రాజా పాల్గొన్నారు.



చాపాడు, బద్వేలులో పార్టీలోకి చేరుతున్న వారితో పుట్టా సుధాకర్‌యాదవ్, వరదరాజులరెడ్డి, రితీష్‌రెడ్డి, రోశన్న

పోరుమామిళ్ల..: వైసీపీ నుంచి టీడీపీలోకి 40 కుటుంబాల వారు యువనేత రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం పోరుమామిళ్ల మండలంలోని చెన్నారెడ్డిపేటలో వైసీపీకి చెందిన సిద్దు గుర్విరెడ్డి, కల్లూరు చెన్నారెడ్డి, ఎస్.రమణారెడ్డి, పి.రమణారెడ్డి, కె.రమణారెడ్డి, అబ్బయ్యగారిగుర్విరెడ్డి ఆధ్వర్యంలో రితీస్‌కుమార్ రెడ్డి, బొజ్జ రోశన్న సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్లు చెరకూరి చెన్నరాయుడు, సాదనకారి రంతు, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, ఎంపీటీసీ కల్వకూరి రమణ, కొండా రామ క్రిష్ణారెడ్డి, ఇమాంహుసేన్, నడిపి వెంకటసుబ్బయ్య. మల్లికార్జునరెడ్డి, రామసుబ్బారావు, రామక్రిష్ణ, నాగలకుంట్ల వెంకటరెడ్డి, జయరాముడు, కవలకుంట్ల విజయభాస్కర్, సోమిరెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు సీతాబాలాజీ, టౌన్ అధ్యక్షుడు మస్తాన్, తిరుమలశెట్టి సుబ్బారావు, అతికారి రాజా, రంతుల్లా, కరీముల్లా, తోట జనార్ధన్, రామచంద్రరెడ్డి, తిరుమలయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపవరం..: గోపవరం మండలంలో 300 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి బద్వేలు యువనేత రితీష్‌రెడ్డి సమక్షంలో చేరడం జరిగింది. కార్యక్రమంలో జడ్పీటీసీ జయరామిరెడ్డి, కాంట్రాక్టర్ ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ రామ్మోహన్‌రెడ్డి, భాగ్యమ్మ, కాల్వపల్లె సర్పంచ్ శ్రీను, సీనియర్ నాయకులు యల్లారెడ్డి, రామానాయుడు, రామసుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, పుట్టావెంకటరెడ్డి, రమణయ్య, దేశాయి ఇతర నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.